


# పండుగాడు

**మా** ఇంటి వెనకవైపు ఒక చిన్నగదీ, ముందు వసారా ఉండేవి. అప్పటిదాకా ఉన్నవాళ్ళు ఖాళీ చేశారు. కొత్తవాళ్ళొచ్చి చేరారు.

భార్యా భర్తా, ఒక చిన్న పిల్లవాడు. వాడికి మూడేళ్ళు నిండాయట. మాటలు బాగా వచ్చాయిగానీ ముద్దు మాటలే. వాడిపేరు వాడిభాషలో చూల్యనాలాయన మూతి. అంటే సూర్యనారాయణ మూర్తి. ముద్దుపేరు పండు.

ఇంట్లో దిగిన మర్నాడే తెల్లవారుతూనే చొరవగా మా ఇంటికొచ్చేశాడు. 'అత్తయ్యా అత్తయ్యా' అని మా అమ్మ వెంట తిరిగాడు.

నేను కనిపించగానే 'అత్తయ్యా' అని నా వెంటపడ్డాడు.

"నేను అత్తయ్యని సరే. దాన్ని కూడా అత్తయ్యా అంటాంవేరా? 'అక్కయ్యా' అనాలి" అంది అమ్మ.

"అవును. నువ్వూ అత్తయ్య, ఇదీ అత్తయ్య" అన్నాడు.

"కాదు పండూ 'అక్కయ్య'అనాలి" అని సరిచేశాను.

"అత్తయ్యనే అంతున్నాను మలి" అన్నాడు వివరంగా.

అప్పటికి మాకు అర్థం అయింది. వాడికి 'క' పలకదని.

ఆ మాటకొస్తే చాలా అక్షరాలు పలకవు. కానీ ఆపూ స్టాపూ లేకుండా లొడలొడ మాట్లాడుతూనే ఉండేవాడు.

ఓరోజు తీరిగ్గా వచ్చి "మీ ఇంట్లో పీతలున్నాయా?" అని అడిగాడు.

"మా ఇంట్లోనే కాదు, ఎవరింట్లోనూ ఉండవు పీతలు. అయినా నీకిపుడు పీతలెందుకురా?" అని అడిగింది అమ్మ.

"పీత మీద కూతుని పాత పాదతా!" అన్నాడు.

"ఓ! పీటలా? కావలిసినన్ని ఉన్నాయి" అంటూ నవ్వుతూ వెళ్ళి ఒక పీట తెచ్చి ఇచ్చింది.

దానిమీద మఠం వేసుకుని కూర్చుని "పాత పాదతా!" అన్నాడు. పాడమన్నాం. "తన్నయ్యా! నల్లని తన్నయ్యా! నిన్ను తన్నలేని తన్నులుందునా?" అని 'నాదీ ఆడజన్మ' సినిమాలోని 'కన్నయ్యా' పాటను వాడి భాషలో పాడాడు.

నవ్వలేక సతమతం అయ్యాం.

"ఇంకోటి పాడరా" అంది అమ్మ.

'లవకుశ'లోని పాటను "ఈలాముని చలితమునూ పెదపెదమమ్మా" అని పాడాడు.

వాడిని పట్టుకుని వాడిచేత వాగించి ఆనందించడం మాకు బాగా అలవాటై పోయింది.

మా ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే తెగ సంబరపడిపోయేవాడు. "అబ్బో! మీ ఇంతితి చాలా చుత్తాలు వచ్చాయే. మీలు ఇప్పుడు లద్దూలూ ఇద్దీలూ చేచుతుంతాలా?" అని అడిగేవాడు.

ఆ చేసిన ఫలహారాలు తిని వాడి మాటలతో వచ్చిన బంధువులను ఆనందపరిచేవాడు.

ఓరోజు మా మామ్మ వస్తే ఆవిడ దగ్గరికి వెళ్ళి "మామ్మగాలూ అయినాలాయన గోవిందా!" అన్నాడు.

"అట్లానా? అయ్యో పాపం...ఎవర్రా? ఇవాళ శుక్రవారం కూడానూ" అంది మామ్మ కంగారుగా.

"నువ్వేం కంగారుపడకు మామ్మా, హరినారాయణ గోవిందా! అంటున్నాడు నోరు తిరగదు వెధవాయ్‌కి" అని చెప్పాను.

"ఓరి భడవా! నీ భాషకాదు గానీ కంగారుపెట్టేశావు కదురా" అంది మామ్మ నవ్వేస్తూ.

మరో రోజు వచ్చి "ఇందాత చాలా చుత్తాలు వచ్చాయి" అని చెప్పాడు. ఎవరెవరు వచ్చార్రా అంటే–

"చీతా, చీపతీ, తుందలమ్మగాలు, లామాలావు మామయ్యా వచ్చాలు" అన్నాడు.

"మరి మీరు కూడా లడ్డూలూ ఇడ్లీలూ వండుకున్నారా?" అని అడిగింది అమ్మ.

"లేదు వుత్తి తాఫీలే" అన్నాడు.

మరో రోజు వాళ్ళ నాన్నవెంట ఆయన పనిచేసే కూల్‌డ్రింక్ ఫ్యాక్టరీకి వెళ్ళొచ్చాడు పండు.

"అత్తయ్యా, అత్తయ్యా, అమ్మో! మా నాన్న ఆపీచులో ఎన్ని సోదాలో. సోదామీద సోదాలు, సోదాల పత్తనే సోదాలు, సోదాలే సోదాలు" అని చెప్పి తెగ సరదాపడి పోయాడు.

వాడు కాసేపు కనపడకపోతే తోచేదికాదు మాకు. సినిమాకివెళ్ళినా, గుడికి వెళ్ళినా వెంట తీసికెళ్ళేవాళ్ళం. ఒకసారి పక్క ఊర్లో పెళ్ళికెళ్ళాలనుకున్నాం.

సాయంత్రం వెళ్ళి మర్నాడు సాయంత్రానికి తిరిగి వచ్చేస్తాం.

పండుగాడిని కూడా తీసికెళ్దాం అనుకున్నాం.

"ఏరా పండూ ఊరికెళ్దాం వస్తావా?" అని అడిగింది అమ్మ.

"నేను లాను బాబూ. నాతు బోలెదన్ని పన్లున్నాయమ్మా" అన్నాడు ఆరిందలా.

"అబ్బో! ఏవిటో అంత పనులు?" అడిగింది అమ్మ.

"నేనూ మా అమ్మ ఈ లాత్తిలి మీ బావిలో దూతి చచ్చిపోవాలి" అన్నాడు.

"ఛ, వెధవా! ఏమిటా మాటలు, తప్పుకాదూ!" అంది అమ్మ.

"అయ్యో! నిజంగానే చచ్చిపోవాలి. మా నాన్ననేమో సోదాల పన్లోంచీ తీచేచాలు. మా ఇంతిలో డబ్బులు లేవుత. ఉన్న దబ్బులు మామ్మ జబ్బుకి చలిపోయాయిత. ఇంతేం చేత్తాం? 'నేనూ పండూ బావిలో దూతి చచ్చిపోతాం' అంది మా అమ్మ. మీలు

డిఖలితెళ్ళండి. మేమేమో బావిలో దూకి చచ్చిపోతాం!" వాడికి వీలైనంత వివరంగా చెప్పాడు.

అమ్మ గతుక్కుమంది. నాన్నగారి మొహం గంభీరంగా మారిపోయింది. చివాల్న లేచి వాళ్ళింటికి వెళ్ళారు. అమ్మ వెంటే వెళ్ళింది.

"ఎంత సంసారం గుట్టు అయితే మాత్రం ఇంత గుట్టుగా ఉండాలా? పసివెధవ ముందు అటువంటి అఘాయిత్యం మాటలు మాట్లాడటం తప్పు కాదూ!" అని మందలించారుట.

వారం తిరిగేసరికల్లా పండువాళ్ళ నాన్నకి తనకు తెలిసిన కాంట్రాక్టర్ దగ్గర ఉద్యోగం వేయించారు మా నాన్నగారు.

ఆ మరుసటిరోజు ఒక గిన్నె బొజ్జకానించుకుని వచ్చాడు పండు.

"ఇవాళ మా నాన్న బోలెదన్ని చామాన్లు తెచ్చాలు-చంచీ నిందా. అమ్మ చపోతీ పిందివంతలు వందింది.

పందూ! పిన్ని గాలితి ఇచ్చిలాలా అంది" అన్నాడు సంబరంగా!

* * *